పేదల ఆశయ సాధన కోసం పార్టీ

- జిల్లా క్రేంద్రంలో ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం
- పార్టీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జోగారావు
- కేక్ కట్ చేసి కార్యకర్తలు, నాయకులకు శుభాకాంక్షలు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ పరిశీలకులు శోభా హైమావతి



వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పేదల ఆశయ సాధన కోసం ఆవిర్భవించిన పార్టీ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి 12వసంతాలు పూర్తి చేసుకుని ఆదివారం 13వ వసంతంలో అడుగుపెట్టిన సందర్భంగా పార్వతీపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద స్థానిక శాసనసభ్యుడు అలజంగి జోగారావు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులతో కలిసి కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటూ..

కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ 2011 మార్చి 12 వ తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో 18 అసెంబ్లీ స్థానాలకు గాను 15 చోట్ల, రెండు లోక్‌సభ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. అప్పటి నుంచి తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ పార్టీని ముందుకు నడిపించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఎట్టకేలకు అధికారం చేపట్టి జనరంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే జోగారావు స్పష్టం చేశారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీని స్థాపించి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ప్రజా సంకల్ప యాత్ర సుదీర్ఘకాలంగా చేపట్టి ప్రజల మద్దతుతో అధికారం చేపట్టారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అధికారం చేపట్టిన వెంటనే వలంటీర్, సచివాలయం వ్యవస్థల ద్వారా లక్షలాది ఉద్యోగాలు కల్పించి ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను చేరువ చేసి ప్రజా రంజక పాలనను సాగిస్తున్నారని, సీఎం వైఎస్ జగన్ ఆశయ సాధనకు పార్టీ కార్యకర్తలు అంతా మరింత కృషిచేయాలని కోరుతూ అందరికీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజాప్రతినిధులు ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీలు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు, స్టేట్ డైరెక్టర్లు, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్‌చైర్మన్లు, ఏఎంసీ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్‌లు జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే

గురువునాయుడుపేటలో..

పాచిపెంట: మండలంలోని గురువునాయుడుపేటలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టిన సంక్షేమాన్ని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొట్టాపు చిట్టమ్మ, వైస్ ఎంపీపీ కొరిపల్లి రవీంద్ర నాథ్, పార్టీ జిల్లా కార్యదర్శులు పాచిపెంట వీరంనాయుడు, కలువలపల్లి పెద్దిబాబు, మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయల గౌరీశ్వరరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు సనాపతి నారాయణరావు, మీసాల ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సాలూరు: బాగువలసలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఘనంగా..

సాలూరు: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. మండలంలోని మామిడిపల్లి, బాగువలస, తదితర ప్రాంతాల్లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నాయకులు మాట్లాడుతూ, పార్టీ పెట్టిన తర్వాత అనతికాలంలోనే 151 ఎమ్మెల్యేలు, 22 ఎంపీలతో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మామిడిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సువ్వాడ శశికళ, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ భరత్ శ్రీనివాస్, పెద్దింటి మాధవ, మువ్వల ఆదయ్య, తదితరులు.. బాగువలసలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, నాయకులు కళ్లేపల్లి త్రినాథ తదితరులు పాల్గొన్నారు.



సాలూరు: మామిడిపల్లిలో ఆవిర్భావ దినోత్సవం



పాచిపెంట: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

క్లుప్తంగా

నేటి నుంచి అమ్మవారి జాతరలు

సీతానగరం: మండలంలోని బూర్జ, తామరఖండి గ్రామాల్లో సోమవారం నుంచి బుధవారం వరకూ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారి జాతరలు జరగనున్నాయి. మక్కువ – అజ్జాడ రోడ్డులో బూర్జలో పెద్దమ్మవారి జాతర, తామరఖండిలో చిన్నమ్మవారి జాతరలు నిర్వహించనున్నారు. జాతర నిర్వహిచే రెండు రాత్రులు గ్రామాల్లో సాంస్కృతిక, పౌరాణిక, కార్యక్రమాల ప్రదర్శనకు ఉత్సవ కమిటీ సభ్యులు సిద్ధం చేశారు. జాతరలకు వేలాదిమంది హాజరుకానున్న కారణంగా సీతానగరం–అజ్జాడ, చినభోగిలి–మక్కువ రహదారిలో అదనంగా బస్సుసర్వీసులు వేయాలని ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు ఎం.శంకరరావు, వై శ్రీనివాసరావు, జి చిన్నంనాయుడు, సూర్యారావులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం



పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

సాలూరు: ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. పట్టణం, మండలం నుంచి సుమారు 2300 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

సీతారాముల కల్యాణానికి మహూర్తపు రాట



ముహూర్తపు రాట వేస్తున్న గ్రామపెద్దలు

సాలూరు: పట్టణంలోని వెలమపేట రామమందిరం వద్ద శ్రీరామనవమి నేపథ్యంలో సీతారాముల కల్యాణానికి ఆదివారం ముహూర్తపు రాట వేశారు. వెలమపేట సేవా సమితి పెద్దలు, యువత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గులిపల్లి రవి దంపతులు పాల్గొని పూజలు చేశారు.

సన్మానం

సాలూరు: విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్న రామానుజన్ మ్యాథ్స్ క్లబ్ వ్యవస్థాపకుడు రంభ రజనీకాంత్‌కు పట్టణంలోని వెలమపేటకు చెందిన నవోదయ యువ సేవా సమితి సభ్యులు, ప్రముఖులు ఆదివారం సన్మానించారు. గణిత క్లబ్ ద్వారా విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నందుకు గాను ఈ సన్మానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గణేశ్వరరావు, ఎంఒఈ రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ హతం



గ్రామస్తుల చేతిలో హతమైన కొండచిలువ

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం సుమారు 10 అడుగుల పొడవున్న కొండచిలువ ప్రధాన రహదారిపైకి వచ్చింది. దాన్ని చూసి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అనంతరం కొందరు గ్రామస్తులు దాన్ని హతమార్చారు.

చర్చిలో దీపారాధనోత్సవం



ఆర్‌సీఎం చర్చిలో దీపోత్సవం నిర్వహిస్తున్న క్రైస్తవులు

భామిని: మండల కేంద్రంలోని ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం రాత్రి దీపారాధనోత్సవం నిర్వహించారు. క్రీస్తు ఆరాధకులు ఉదయం నుంచి ఉపవాసాలతో దైవ వాఖ్యాలు వింటూ కొవ్వొత్తులు వెలిగించి దీపోత్సవం నిర్వహించారు. బత్తిలి చర్చి ఫాదర్స్ సనాతన్ మలో బిసాయి, రాజు బైబిల్ వాఖ్యాలు వినిపించారు. క్రీస్తు విశ్వాసకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

బీజేపురం విద్యార్థుల ప్రతిభ

జియ్యమ్మవలస: జిల్లా స్థాయిలో డెల్టా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంగ్లిష్ ప్రతిభ పోటీలో బీజేపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు నరసింహ చౌదరి ఆదివారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొదటి పది స్థానాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు 1,2,4,6 స్థానాల్లో నిలిచినట్లు చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఘనంగా ఛాత్రాలయ వార్షికోత్సవం

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో గల ఎయిమ్ ఫర్ సేవా ఛాత్రాలయంలో విద్యార్థులను ఆదుకోవడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు అన్నారు. ఈ మేరకు ఆదివారం స్వామి దయానంద సరస్వతి (ఎయిం ఫర్ సేవ) ఛాత్రాలయ 16వ వార్షికోత్సవం స్వామి స్థర్యానంద (గుడివాడ) సరస్వతి అధ్యక్షతన కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ క్వార్టర్స్‌ను అఉనుకుని 16 సంవత్సరాల క్రితం స్వామి దయానంద సరస్వతి ఛాత్రాలయాన్ని ఏర్పాటు చేయడం, నాటి నుంచి అనాథ పిల్లలను అక్కున చేర్చుకుని కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విద్యాబుద్ధులు నేర్పించడం, వసతి సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఛాత్రాలయ విద్యార్థులకు తమవంతు సహకారాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ మూర్తి, ఎస్.సాయిరమేష్, టి.కార్తీక్, ఛాత్రాలయ కమిటీ సభ్యులు కొత్తారవి, సాలా అశోక్, పుల్లెల శ్రీనివాస్, గోనా ప్రసాద్, టి.గురునాథరావు, పి.నాగమణి, ఛాత్రాలయ మేనేజర్–ఇన్‌చార్జి ఎస్.సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్.వేణుగోపాలనాయుడు

నేటి నుంచి పాదాలమ్మ సంబరాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని శివడవలస గ్రామంలో పాదాలమ్మ తల్లి సంబరాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొమ్మిదేళ్లకోసారి జరిగే ఈ ఉత్సవాలను ఏటా ఎంతో ఘనంగా నిర్వహిస్తుంటారు. ఇప్పటికే వేడుకల నిర్వహణకు సంబంధించి, అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీ చర్యలు చేపట్టింది. సోమవారం తొలేళ్ల సంబరం, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అనుపోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఘటాలకు ప్రత్యేక పూజలు..

సోమవారం నుంచి పాదాలమ్మ తల్లి సంబరాలు నేపథ్యంలో ఆదివారం అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఘటాల ఊరేగింపులో భక్తులు అమ్మవారికి విశేష పూజలు చేసి, భక్తిశ్రద్ధలు చాటుకున్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న ఆదివాసీ ఉపాధ్యాయుల అసోసియేషన్ సభ్యులు

కొమరాడ: గత నెల 22న చోళ్లపథం మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవుకోన పంచాయతీ అంటివలస గ్రామానికి చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన సంఘటన తెలిసిందే. బాధిత కుటుంబ సభ్యులకు ఉమ్మడి విజయనగరం జిల్లా ఆదివాసీ ఉపాధ్యాయుల అసోసియేన్ తరఫున రూ.70వేలు జిల్లా అధ్యక్షుడు మువ్వల అమర్నాథ్ సతిమణి సునీత చేతులుమీదగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు అసోసియేషన్ తరఫున సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు తాడంగి సత్యానారాయణ, జాయింట్ సెక్రటరీ గౌడు సురేష్, నియోకవర్గం ఇన్‌చార్జి వై.సూర్యనారాయణ, కురుపాం మండల కార్యదర్శి మాధవ, సింహాచలం, సభ్యులు రామకృష్ణ, హరిగోపాల్ సుబ్బరావు, సూర్యరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గిరిజన స్పందన రద్దు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో సోమవారం జరగాల్సిన గిరిజన స్పందన కార్యక్రమం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కారణంగా రద్దు చేయడం జరిగిందని ప్రాజెక్టు అధికారి బి.నవ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఎటువంటి వినతులు స్వీకరించబడవన్నారు.

ఆధ్యాత్మిక సత్సంఘ్



ఆధ్యాత్మిక సత్సంఘ్‌లో మాట్లాడుతున్న వక్తలు

పాలకొండ రూరల్: మండలంలోని అన్నవరం గ్రామంలో వెలసిన షిర్డీసాయి అష్టలక్ష్మి సహిత గాయత్రి మందిరంలో ఆదివారం ఆధ్యాత్మిక సత్‌సంఘ్ కార్యక్రమం నిర్వహించారు. మందిర నిర్వాహకులు గవర గురునాథరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు అరటికట్ల కామేశ్వర రావు, గోపన్న తదితరులు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. భగవంతుని అనుగ్రహంతో మానవుడు ఉత్తమ స్థాయికి చేరుకుంటాడన్నారు. ఆధ్యాత్మిక మార్గం అనుసరించటం వలన కలిగే ప్రయోజనాలను మజ్జి సూర్యనారాయణ, జడ్డు జగ్గారావు, కె.జనార్దనరావు తదితరులు వివరించారు. అనంతరం మందిరంలో విశేష పూజలు జరిగాయి.

కోటదుర్గమ్మకు పూజలు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మకు భక్తులు ఆదివారం సంబరాలు నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, సాంప్రదాయ నృత్యాల మధ్య భక్తులు ముర్రాటలు, ఘటాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి చల్లదనం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న మాజీ సైనికులు

బొబ్బిలి: పట్టణంలో మాజీ సైనికుల కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించండి అని ఆ సంఘ అధ్యక్షుడు రెడ్డి దామోదరరావు కోరారు. ఇదే విషయమై స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడును ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

సీతానగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను పురస్కరించుకుని పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఉన్నత పాఠశాల ఆవరణలోని పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీఓ బి.కృష్ణ మహేష్‌రెడ్డి, ఎస్సై కె.నీలకంఠం ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎన్వీ రమణ మాట్లాడుతూ మండలంలో 1258 మంది పట్టభద్రులైన ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలియజేశారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి అధికారుల పర్యవేక్షణలో అవసరమైన ఏర్పాట్లు చేశామని తెలియజేశారు. ఓటర్లకు తాగునీటి సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. అలాగే ఉన్నత పాఠశాల ప్రాంగణమంతా 144 సెక్షన్ అమలులో ఉందని, ఎటువంటి అవాంఛనీయ సఘటనలు జరిగినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే నిషేధాజ్ఞ లున్న ప్రాంతాన్ని మార్కింగ్ చేశామన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

సీతానగరం: వేసవి సందర్భంగా మండలంలోని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి నివారణకు బోర్ల మరమ్మతులు చేపట్టినట్లు మెకానిక్ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం కాంట్రాక్ట్ బోర్ మెకానిక్ నిర్వహించిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 478 మంచినీరుబోర్లున్నాయని, వేసవి కాలం రావడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రజావసరాలను పరిగణనలోకి తీసుకుని ముందుగా బోర్లకు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. అన్నిగ్రామాల్లో బోర్ల మరమ్మతులు నిర్వహించడానికి అవసరమైన ముడి సరుకు రావలసి ఉందన్నారు. అలాగే మంచినీటి పైప్‌లు, గ్రామాల్లో కోట్లాది రూపాయల వ్యయంతో ఇంటింటి కుళాయి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు అందిన రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.



జోగింపేటలో బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పొదుపు సంఘాల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

సీతానగరం: మండలంలోని పొదుపు సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి, వెలుగుద్వారా బీమా సౌకర్యం కల్పించడానికి వీఏఓలు ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీఎం ఆర్.శ్రీరాములు అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల సమాఖ్య కార్యాలయంలో వీఏఓలతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శ్రీ నిధి ద్వారా బ్యాంకు రుణాలు పొందిన వారు సకాలంలో వాయిదాలు చెల్లించేలా వీఏఓలు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో సీసీల పర్యవేక్షణలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పీఎం ఎస్‌బీవై పథకం ద్వారా 18 సంవత్సరాల వయస్సు నుంచి 70 సంవత్సరాలలోపు ఉన్న బ్యాంక్ ఖాతా దారులకు వార్షిక ప్రీమియం రూ.20 లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రీమియం చెల్లించిన వారికి రూ 2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. అలాగే పీఎంజేజేబీవై పథకం ద్వారా వార్షిక ప్రీమియం రూ.436 చెల్లించిన వారికి బీమా రూ.2లక్షలు వర్తిస్తుందన్నారు. ఈ పథకానికి 18 సంవత్సరాల వయస్సు నుంచి 50 సంవత్సరాల వయస్సులోపు ఉండాలని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని పొదుపు సంఘ సభ్యులు వినియోగించుకోవాలని కోరారు. సీసీలు, వీఏఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం ఆర్.శ్రీరాములు

ముమ్మరంగా వాహన తనిఖీలు

పాలకొండ రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పాలకొండ–శ్రీకాకుళం, విశాఖ, వీరఘట్టం రహదారుల్లో పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఆయా మార్గాల్లో ఆదివారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానస్పద కదలికలు, ఓటర్లను ప్రలోబ పెట్టేందుకు నగదు, ఇతర వస్తువులు, మద్యం తరలించే అవకాశాలు ఉన్నందున ఈ తనిఖీలు చేస్తున్నట్లు సీఐ మురళీధర్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ కొనసాగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.



శ్రీకాకుళం రహదారిలో చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

తల్లిదండ్రుల దీవెన బ్రహ్మదీవెన

రేగిడి: తల్లిదండ్రుల దీవెన బ్రహ్మ దీవెన లాంటిదని, ప్రతీ విద్యార్థి తల్లిదండ్రుల దీవెనలు తప్పనిసరిగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు అన్నారు. ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వారి తల్లిదండ్రులతో దీవెనలు ఇచ్చే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు అహర్నిశలు కష్టపడుతుంటారని, వారిని బాధ పెట్టకుండా బాగా చదువుకుని ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయా తరగతుల విద్యార్థులు తల్లిదండ్రుల కాళ్లు కడిగి, ఆశీస్సులు పొందారు. వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలో విద్యార్థులకు తల్లిదండ్రుల దీవెనలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ పరీక్షలు రాయనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులంతా తమ తల్లిదండ్రుల పాదాలు కడిగి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. పరీక్షలు బాగా రాయాలని, మంచి మార్కులు తెచ్చుకునేలా దీవించమని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.రాజశేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.

పార్కులో పర్యాటకుల సందడి



జలవిహార్‌లో బోటుషికారు చేస్తున్న పర్యాటకులు

సీతంపేట: స్థానిక అడ్వంచర్ పార్కులో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో పార్కు కళకళలాడింది. జలవిహార్‌లో బోటుషికారు, బంజీట్రంపోలిన్, స్కైసైక్లింగ్, హ్యాంగింగ్ బ్రిడ్జిపై సాహసాలు చేస్తూ ఆనందించారు. చిన్నారులు బొమ్మట్రైన్ ఎక్కి సందడి చేశారు.



స్కైసైక్లింగ్ చేస్తున్న యువత



బొమ్మట్రైన్‌పై చిన్నారుల సందడి